క్లుప్తంగా

విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు పాఠశాలలు

చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసిన విశ్వేశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి

చేవెళ్ల: విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు పాఠశాలలని ఇవి దేవాలయాలతో సమానమని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలోని వివేకానంద ఇంటర్నేషనల్ స్కూల్‌లో కళాకృతి పేరుతో వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయనతోపాటు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యా అందించేందుకు స్కూల్ ఏర్పాటు చేయడంపై యాజమాన్యాన్ని అభినందించారు. చిన్నప్పటినుంచే సంస్కృతి, సంప్రదాయలపై అవగాహన కల్పించాలని చెప్పారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చి దిద్దాలని చెప్పారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లావణ్యనరేశ్, డైరెక్టర్ హనుమంతరావు, మౌనిక, వెంకట్‌రెడ్డి, హరిక్రిష్ణ, ప్రిన్సిపాల్ మానసచౌదరి, విద్యావేత్త శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా నరేందర్

షాబాద్: షాబాద్ మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా కావలి నరేందర్‌ను నియమించినట్లు చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి తెలిపారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో సోలిపేట్ గ్రామానికి చెందిన కావలి నరేందర్‌ను, చేవెళ్ల నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా కేసారం గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డిని నియమించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను అర్హులకు చేరేవిధంగా కృషి చేస్తామన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు కృష్ణంరాజు, భీంభరత్

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి కృష్ణంరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్ పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో యూత్ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడుపల్లి పెంటారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదని, సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాడన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు చేసే విషయంలో చిత్తశుద్ధితో పార్టీ నాయకులు పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వయ సమితి చైర్మన్ చింపుల సత్యనారాయణరెడ్డి, పీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, మండల యువజన అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, మొయినాబాద్ యూత్ అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు కార్తీక్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి భార్గవ్‌రామ్, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచ్‌లు నరేందర్‌రెడ్డి, ర్యాకల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

శుభ్రత పాటించాలి

ఎంపీడీఓ వెంకయ్య గౌడ్

శంకర్‌పల్లి: హోటళ్లల్లో తప్పని సరిగా శుభ్రత పాటించాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ పేర్కొన్నారు. శనివారం మోకిల గ్రామంలోని శ్రీ రాఘవేంద్ర ఉడిపి, వన భోజనం, ఎస్వీ రాజధాని, శ్రీకార్ హోటళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. అక్కడ మురుగుతో పాటు అపరిశుభ్రంగా ఉండడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటళ్ల యాజమానులకు నోటీసులు అందజేశారు.

పార్క్ చేసిన బైక్ చోరీ

మొయినాబాద్: హోటల్ ఎదుట పార్క్ చేసిన బైక్ చోరీకి గురైంది. ఈ సంఘటన మొయినాబాద్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కాట్రావత్ ఉత్పల్ హిమాయత్‌నగర్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. శుక్రవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో టీఎస్ 06 ఎఫ్ఎఫ్ 9544 నంబరు గల తన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై హిమాయత్‌నగర్‌లోని స్వాన్జా లివింగ్ హోటల్‌కు వెళ్లాడు. హోటల్ ఎదుట బైక్‌ను పార్క్ చేయగా గుర్తి తెలియని వ్యక్తులు చోరీ చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం మొయినాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి
- నిండు జీవితానికి రెండు చుక్కలు తప్పనిసరి
- ఐదేళ్ల లోపు చిన్నారులు 34,156 ఉన్నట్లు గుర్తింపు
- మందు పంపిణీకి సర్వం సిద్ధం
- నేడు పల్స్ పోలియో



పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ

షాద్‌నగర్: పోలియోను శాశ్వతంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందు వేయనున్నారు. దీనికోసం వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమం ఆదివారం ప్రారంభం కానుంది.

వైరస్ వ్యాప్తి..

తాగునీరు, కలుషిత ఆహారంతో ఒకరినుంచి మరొకరికి వైరస్ వ్యాప్తి చెందుతుంది. ఇది శరీరంలోకి ప్రవేశించిన 7 నుంచి 15 రోజుల్లో వాటి లక్షణాలు బయటపడుతాయి. అకస్మాత్తుగా జ్వరం, తల, గొంతు, పంటి నొప్పి ప్రారంభమవుతుంది. వికారం, వాంతులు, విరేచనాలు మొదలవుతాయి. జ్వరం వచ్చిన రెండు రోజుల నుంచి ఏడు రోజుల లోపు కాలు ఈడుస్తూ నడిచినా.. చేతులు వాలిపోయినట్లు చేసినా.. చిన్నారులు ఏడ్చే సమయంలో పొట్టలో ఓ వైపు ఉబ్బుతుంటే పోలియో ప్రారంభ దశలో ఉన్నట్లు గుర్తించాలి. కండరాల బలహీనత వచ్చి కాళ్లు, చేతుల్లో పటుత్వం కోల్పోతారు. నడుము, పొట్ట కండరాలకు సైతం పక్షవాతం వచ్చే అవకాశాలు ఉంటాయని వైద్యులు తెలిపారు. కొందరికి ఫిట్స్ సైతం రావొచ్చు.

వ్యాక్సిన్ పంపిణీ ఇలా..

షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని కొత్తూరు, నందిగామ, కేశంపేట, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల పరిధిలో సున్నా నుంచి ఐదేళ్లలోపు చిన్నారులు మొత్తం 34,156 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నియోజకవర్గంలో వ్యాక్సిన్ వేసేందుకు 29 రూట్లలో 292 బూతులను, 426 బృందాలు ఏర్పాటు చేశారు. ఇందులో మొత్తం 1,252 ఆరోగ్య సిబ్బంది పని చేయనున్నారు. అదేవిధంగా ఏడు మొబైల్ బృందాలు, 10 ట్రాన్సిస్టర్ పాయింట్లు ఏర్పాటు చేశారన్నారు. మొత్తం 2,372 వ్యాక్సిన్ వాయిల్స్ అందుబాటులో ఉంచినట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు.

సిబ్బందికి అవగాహన

చుక్కల పంపిణీ కోసం ఆరోగ్య సిబ్బందికి ఇప్పటికే ఉన్నతాధికారులు శిక్షణా తరగతులు నిర్వహించారు. చిన్నారుల గుర్తింపు, రికార్డుల నిర్వాహణ, ఇంటింటి సర్వే వంటి కార్యక్రమాలు ఏవిధంగా చేయాలన్న అంశాలపై అవగాహన కల్పించారు.

చిన్నారుల ఆరోగ్య రక్షణకు కృషి

పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వం పల్స్ పోలియో నిర్వహిస్తుంది. చిన్నారుల ఆరోగ్య రక్షణకు అందరూ కృషి చేయాలి

– శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్, షాద్‌నగర్

పోలియో చుక్కలు విధిగా వేయించాలి



ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించేందుకు తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో, రద్దీ ప్రాంతాల్లో, పంచాయతీ కార్యాలయాల్లో చుక్కల మందు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఈ విషయంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలి.

– డాక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్ఓ

సమస్యలు పరిష్కరించాలి

కార్మిక సంఘం నేత నర్సింహ్మారెడ్డి



ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న నర్సింహ్మారెడ్డి

కొత్తూరు: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పలువురు కార్మికులతో కలిసి కొత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో తమ సమస్యల సాధన కోసం గ్రామ పంచాయతీ కార్మికులు సుమారు 34 రోజులు ధర్నా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ విషయంలో అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ నేతలు తమ ధర్నాకు మద్దతు ప్రకటించి, తమ పార్టీ అధికారంలోకి వస్తే వేతనాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలు సహకరించాలని కోరారు. పంచాయతీల్లోని ట్రాక్టర్లకు ఇన్సూరెన్స్, డ్రైవర్లకు ఉచితంగా లైసెన్సులు ఇప్పించాలన్నారు. కార్మికుల హోదాతో సంబంధం లేకుండా ఈఎస్ఐ, పీఎఫ్‌తో పాటు అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికులకు మాస్కులు, గ్లౌజులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, రాములు, శేఖర్‌రెడ్డి, సురేశ్, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను వీడినా నష్టంలేదు

మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాజు

మొయినాబాద్: బీఆర్ఎస్ మండల అధ్యక్ష పదవిని ఆరు సంవత్సరాల పాటు అనుభవించిన దేవరంపల్లి మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్‌కు పట్టిన శని వదిలిందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డప్పు రాజు, ఎనికేపల్లి ఎంపీటీసీ సభ్యుడు రితీశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంతకాలం మహేందర్‌రెడ్డి మండల అధ్యక్షుడిగా అధికారాన్ని అడ్డం పెట్టుకుని భూదందాలు కొనసాగించారని ఆరోపించారు. అక్రమ ఆస్తులు, దందాను కాపాడుకోవడం కోసమే కాంగ్రెస్‌లో చేరారని మండిపడ్డారు. మహేందర్‌రెడ్డి పార్టీని వీడినంత మాత్రాన మండలంలో బీఆర్ఎస్‌కు వచ్చిన నష్టమేమి లేదని సంతోషం వ్యక్తం చేవారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపిస్తామన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్

కార్మికుడి దుర్మరణం

నందిగామ: బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ దుర్ఘటన శనివారం మండల కేంద్రం శివారులోని చంద్రాయాన్‌గూడ సమీపంలో పాతజాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన భీకారం చౌదరి(38) నగరంలోని కూకట్‌పల్లిలో నివాసం ఉంటూ కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఆయన షాద్‌నగర్‌లో ఉండే బంధువుల వద్దకు బైక్‌పై వెళ్తున్నాడు. చంద్రాయాన్‌గూడ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డు మధ్యనున్న డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు బలమైన గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడి కుమారుడు దీపక్‌చౌదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్ అజీంఅలీ

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా కొనసాగుతున్నాయి. శనివారం పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ అజీంఅలీ పరిశీలించారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 165మందికి 162 హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ మల్లేశ్ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ కూడా పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా పల్లకీ సేవ



పూజలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ఘనంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆట పాటలు, భజనలతో స్వామి వారిని ఊరేగించారు. ఆలయ అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రచారి, కృష్ణ, ప్రమోద్, సునీల్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణానికి చెందిన ఆకారపు సుబ్రమణ్యం, సంధ్య దంపతులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లతా శ్రీశైలంగౌడ్, వసంతరావు, రఘునందన్‌రెడ్డి, రఘుగౌడ్, రమేశ్, నర్సింలు, శ్రీనివాస్, కిషన్, లక్ష్మణ్, రాఘవేందర్, నారాయణ, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో వినతుల స్వీకరణ



కేశంపేట: ఫిర్యాదులు స్వీకరిస్తున్న నాయబ్ తహసీల్దార్ గీత

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లో ధరణి సమస్యలపైన అధికారులు వినతి పత్రాలను స్వీకరిస్తున్నారు. శనివారం మండల పరిధిలోని బోధునంపల్లి, చౌలపల్లి, బైర్కాన్‌పల్లి, లేమామిడి గ్రామాల్లో ధరణి స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ధరణి సమస్యల పైన రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయబ్ తహసీల్దార్ గీత, ఆర్ఐ నివేదిత, సీనియర్ అసిస్టెంట్ మహేందర్, ఏఈఓలు లలిత, సమీయొద్దీన్, ప్రశాంత్, సుధ, పంచాయతీ కార్యదర్శులు స్నేహలత, విజయ్, వెంకటేశ్, యాదగిరి, రెవెన్యూ సిబ్బంది మహేశ్, జంగయ్య, శ్రీకాంత్, వెంకటేష్, శ్రీను, శివలీల, శ్రీనివాస్, శివకుమార్, నరసింహా, శ్రీరామ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: ధరణి పోర్టల్లో పలు సమస్యల పరిష్కారం కోసం చేసుకున్న దరఖాస్తులను రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. గ్రామాలకు వెళ్లి రైతుల వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. భూములను పరిశీలించి వాటి పరిస్థితిని గుర్తిస్తున్నారు. శనివారం మండల పరిధిలోని కుత్బుద్దీన్‌గూడ, చందానగర్ గ్రామాల్లో డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్, ఆర్ఐ రోజా, సీనియర్ అసిస్టెంట్ సురేందర్ తదితరులు పర్యటించారు. ధరణిలో దరఖాస్తు చేసుకున్న రైతులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా భూములను పరిశీలించి ఏ స్థితిలో ఉన్నాయో పరిశీలించారు.

కేంద్రంలో బీజేపీదే అధికారం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ పార్లమెంట్ కన్వీనర్ కృష్ణవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ రూరల్: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని లాబార్థి మహబూబ్‌నగర్ పార్లమెంట్ కన్వీనర్ కృష్ణవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో మండల అధ్యక్షుడు దొడల వెంకటేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు, బూత్ కమిటీ అధ్యక్షులతో లాబార్థి సంపర్క్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. మోదీ పథకాలను అందుకున్న లబ్ధిదారులను గ్రామంలోని బూత్ కమిటీ అధ్యక్షులు, సభ్యులు నేరుగా కలుసుకొని వారితో మాట్లాడాలన్నారు. దేశంలో మరోమారు నరేంద్రమోదీ ప్రధాని కావాలని, లేదంటే దేశ విచ్ఛిన్నానికి, దేశ భద్రతకు భంగం కలిగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గత పదేళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. అనంతరం రాష్ట్ర క్యావర్గ సభ్యుడు అందెబాబయ్య మాట్లాడుతూ 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యంవచ్చి 100 సంవత్సరాలు పూర్తవుతుందని, ఈ సందర్భంగా ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా భారత్‌ను అభివృద్ధి చేయడమే మోదీ ధ్యేయమన్నారు. ఈ సమావేశంలో ఎస్సీమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎంకనోళ్ల వెంకటేశ్, శివకృష్ణ, రఘుగౌడ్, శంకర్‌నాయక్, నర్సింలు, శివశంకర్, నర్సింహ్మ, విష్ణు, లింగంనాయక్ పాల్గొన్నారు.

ఉపాధి కూలి పెంచాలి

వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్



మాట్లాడుతున్న శ్రీనునాయక్

షాద్‌నగర్ రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కార్మికులకు కూలి పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చింబోడ్ గ్రామంలో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రదేశానికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ చట్టంకింద గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న కూలీలకు ప్రతిరోజు రూ. 800ల కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొలతల ప్రకారం వారు చేస్తున్న పనికి డబ్బులు సరిపోవడంలేదని, కొలత పద్ధతిని రద్దు చేయాలన్నారు. వర్షాలు అనుకున్న స్థాయిలో పడలేదని, దీంతో వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం లేదన్నారు. జాబ్ కార్డు కలిగిన కార్మికులకు 100 రోజుల నుంచి 200 రోజుల పనిదినాలు కల్పించాలని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పెంటారెడ్డి, చిన్నమ్మ, పద్మ పాల్గొన్నారు.

శంకర్‌పల్లి సీఐ బదిలీ

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి సీఐ వినాయకరెడ్డి బదిలీ అయ్యారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వినాయకరెడ్డిని బాల్‌నగర్ జోన్ ఎస్ఓటీకి బదిలీ చేశారు. బహదూర్‌పురలో పనిచేస్తున్న మహమ్మద్ హబీబుల్లాఖాన్ శంకర్‌పల్లి సీఐగా నియమించారు.

పశువులను జాగ్రత్తగా చూసుకోవాలి

కృషి విజ్ఞాన కేంద్రం పశు సంవర్ధక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సుధీర్‌కుమార్

షాబాద్: పాడి పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు డాక్టర్ల సలహాలు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం పశు సంవర్ధక శాస్త్రవేత డాక్టర్ సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామంలో జిల్లా క్రీడ కృషి విజ్ఞాన కేంద్రం, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశువుల్లో వచ్చే సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఉండే పాడి పశువులకు చికిత్సలు చేయించాలన్నారు. సంకరజాతి పశువుల్లో వచ్చే పునరుత్పత్తి సమస్యలు, మేలైన పశుగ్రాసం అందజేస్తామన్నారు. చూడి పశువుల జాగ్రత్తలు, షెడ్ నిర్వహణ, ఆధునిక యంత్రాలపై అవగాహన కల్పించామన్నారు. సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ యువత స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ పథకం ద్వారా శిక్షణ పొంది, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపాధి అవకాశాలు పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సుగుణమాల రైతు ఉత్పత్తి దారుల సంఘం డైరెక్టర్లు లింగం, వెంకటయ్య, రైతులు ప్రవీణ్, చంద్రశేఖర్, రమేశ్, విష్ణు, రవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



షాబాద్: పాడిపశువులను పరిశీలిస్తున్న డాక్టర్ సుధీర్‌కుమార్

మొయినాబాద్ రూరల్: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలను తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్య అధికారి దేవిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పశువైద్య అధికారులు దేవిరెడ్డి అండాపూర్ గ్రామంలో, శ్రీలతరెడ్డి కనకమామిడిలో గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాధి నివారణకు టీకా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వేసవి కాలంలో పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. ఉచిత టీకాల పంపిణీని రైతులు తమ పశువులకు వేయించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

గాలికుంటు నివారణకు..

షాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని రేగడిదోస్వాడ, షాబాద్ పశు వైద్యాధికారులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ ప్రవంతి అన్నారు. శనివారం మండల పరిధిలోని సోలిపేట్, మక్తగూడ గ్రామాల్లో టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



షాబాద్: టీకా వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి



టీకా వేస్తున్న పశువైద్య అధికారి దేవిరెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిద్దాం

జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి

మొయినాబాద్‌రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కలిసికట్టుగా కృషి చేద్దామని వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మనోజ్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ యాలాల జైపాల్‌రెడ్డి, బాలరాజు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి తదితరులు శనివారం సునీతారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆమె కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామాల్లో గడప గడపకు ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పిస్తూ కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని సూచించారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు